




	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	31	22
భద్రాద్రి	32	20



రంజాన్ మాసం

ఇఫ్తార్ (సా): 6:25 (గురువారం)

సహర్ (తె): 4:50 (శుక్రవారం)

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉదాత్త ఆశయంతో ప్రారంభించిన ఆరు గ్యారంటీల స్కీమ్... క్షేత్రస్థాయిలోని కొందరు ఉద్యోగుల బాధ్యతారాహిత్యం మూలంగా అపవాదును మూటగట్టుకుంటోంది. ఆరు గ్యారంటీలకు అర్హులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం 'ప్రజాపాలన' సభల్లో దరఖాస్తులు స్వీకరించిన విషయం విధితమే. నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేసి మరీ ఈ దరఖాస్తులను స్వీకరించారు. ఆ సమయంలో లక్షల కొద్దీ దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఆన్‌లైన్ చేసి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా, సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా లక్షలాది దరఖాస్తులు గల్లంతయ్యాయి. గృహజ్యోతి జీరో బిల్లులు అందని అర్హులు ఎంపీడీవో, మునిసిపల్, కార్పొరేషన్ కార్యాలయాలకు వెళ్లినప్పుడు ఈ బాగోతం కళ్లకు కడుతోంది. దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకపోవడంతో అర్హుల వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. దీంతో 'గృహజ్యోతి' జీరో బిల్లులు, గ్యాస్ సబ్సిడీ అందకుండా పోయాయి.

- వెబ్‌సైట్‌లో నమోదు చేయని సిబ్బంది
- లక్షలమంది పేదలకు అందని 'గృహజ్యోతి'
- అధికారుల అలసత్వమా? సిబ్బంది నిర్లక్ష్యమా?
- ప్రభుత్వ ఉదాత్త ఆశయానికి తూట్లు
- నెలకు రూ.10కోట్లకుపైగా బిల్లులు, సబ్సిడీ భారం
- కోడ్‌తో ఆగిన వెబ్‌సైట్.. ముగిసేవరకు ఆగాల్సిందే
- ఆందోళనలో పేద, మధ్య తరగతి వర్గాలు



ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

అర్హుల నోట్లో మట్టి


'ప్రజాపాలన'లో స్వీకరించిన దరఖాస్తులు గల్లంతు

ఖమ్మం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని కైకొండాయిగూడేనికి చెందిన సిరికొండ భారతి, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సమయంలో తన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వివరాలు అందించి గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకుంది. ఆ తర్వాత విద్యుత్ శాఖవారు ఆమె ఇంటికి వచ్చి మీటరు నెంబరుతో ఆన్‌లైన్ కూడా చేశారు. అయితే కరెంటు బిల్లు తీసిన తర్వాత జీరో బిల్లు రాకపోవడంతో ఆమె విస్తుపోయింది. ఇదేమని విద్యుత్ శాఖ అధికారులను అడగ్గా.. వారు మీటరు నెంబరు చెక్‌చేసి, గృహజ్యోతిలో నమోదు చేయలేదని ఎంపీడీవో, మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లాలని సెలవిచ్చారు. దీంతో ఆమె రెండోసారి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసింది. అయినప్పటికీ ఆమెకు ఇప్పటికీ జీరో బిల్లు మాత్రం రాలేదు. ఇది కేవలం భారతి విషయంలోనే కాదు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాదిమంది దరఖాస్తుదారుల విషయంలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

దరఖాస్తులు గల్లంతు...

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆరుగ్యారంటీల అమల్లో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను వేగవంతంగా నిర్వహించింది. నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేసి మరీ అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఆ సమయంలో లక్షల కొద్దీ దరఖాస్తులు వచ్చాయి.

ఆ తర్వాత ప్రక్రియలో ఏమి జరిగిందో కాని మొదటిగా అమలు చేసిన గృహజ్యోతి పథకంలో అర్హులు కూడా అనర్హతతో విద్యుత్ బిల్లులు పొందారు. ఆయా దరఖాస్తుదారులకి విద్యుత్ శాఖ అందించే బిల్లులో 200 యూనిట్ల లోపు వినియోగం ఉన్నప్పటికీ జీరో బిల్లులు రాలేదు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనతో కొందరు తాము మొదటిసారి చేసుకున్న దరఖాస్తు చేసుకున్నప్పటి రశీదుతో ఎంపీడీవో కార్యాలయాలకు, మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయాలకు వెళ్లిన తర్వాత అక్కడ జరిగిన సంఘటన చూసి కంగుతిన్నారు. ప్రభుత్వం అప్‌గ్రేడేషన్ కోసం ఇచ్చిన వెబ్‌సైట్‌లో ఆధార్‌నెంబర్, ఫోన్ నెంబర్ ద్వారా పరిశీలించినప్పుడు ఆయా దరఖాస్తుదారులకు సంబంధించిన వివరాలు కనిపించకపోవడం గమనార్హం. కాగా ఇటీవల పెట్టిన క్యాంపుల్లో ఆయా మండల, జిల్లా కేంద్రాల్లోని కార్యాలయాలకు కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు చేరినట్టు తెలుస్తోంది. వాస్తవానికి మొదటిసారి దరఖాస్తు ఇచ్చిన సందర్భంలో ఇచ్చిన వివరాలతో పరిశీలించినప్పుడు సంబంధిత దరఖాస్తుదారుడు లబ్ధిదారుడు కానప్పటికీ ఆ వివరాలైనా వెబ్‌సైట్‌లో కనిపించకపోవడం శోచనీయం. ఇలా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది దరఖాస్తులు మాయమయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే చాలామంది అర్హత ఉన్నప్పటికీ, పథకాలపై అవగాహన లేక రెండోసారి దరఖాస్తు చేసుకోని వారు భారీగా ఉన్నట్టుగా తెలుస్తోంది. అయితే దీనిపై కొందరు అధికారులు మాత్రం మొదటిసారి ఇచ్చిన దరఖాస్తుల్లో పాత రేషన్‌కార్డు నెంబర్లు వేసిన కారణంగానే తప్పులు దొర్లాయంటూ సమాధానమివ్వడం కొసమెరుపు. అలా రెండోసారి అవకాశం ఇచ్చిన సమయంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 15వేల దరఖాస్తుల వరకు అప్‌గ్రేడేషన్, కొత్త దరఖాస్తులను స్వీకరించారు.



ప్రజా పాలన దరఖాస్తు రశీదు



గృహజ్యోతి స్టేటస్‌లో ఆధార్ కార్డు, రేషన్‌కార్డు నెంబర్లు లేవని చూపిస్తున్న దృశ్యం

ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ అర్హులు

జిల్లా	రేషన్‌కార్డులు	జీరో బిల్లులు	గ్యాస్ సబ్సిడీ
ఖమ్మం	4,11,283	2,39,649	2,16,912
భద్రాద్రి	2,82,435	1,40,189	1,45,131

కోడ్‌తో ఆగిన వెబ్‌సైట్..

ప్రస్తుతం రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమల్లో ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల వెబ్‌సైట్‌ను నిలిపివేసింది. దీంతో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకున్నవారు, పాత దరఖాస్తుల్లో తప్పులు దొర్లినవారు సరిచేసుకునేందుకు ఎలాంటి అవకాశం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం అమలు చేసిన పథకం పూర్తిస్థాయిలో పేదల దరికి చేరని పరిస్థితి నెలకొంది. వాస్తవానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6.93 లక్షల రేషన్ కార్డులు ఉండగా.. ప్రస్తుతం గృహజ్యోతి ద్వారా మాత్రం జీరో బిల్లుకు రూ. 3.79 లక్షలు, గ్యాస్ సబ్సిడీకి రూ. 3.62 లక్షల మంది మాత్రమే అర్హులుగా ఉండటమే దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ తప్పుల తడకగా సాగిందనడానికి నిదర్శనంగా నిలుస్తోంది. జిల్లాలో ఉన్న రేషన్ కార్డుల ఆధారంగా లెక్కిస్తే కేవలం సగం మంది మాత్రమే అర్హులు ఉండటం గమనార్హం.

వీరితోపాటుగా ఇతర జిల్లాలకు చెందిన వేలాది కుంటుంబాలు ఖమ్మం నగరంలో నివాసం ఉంటున్నాయి. వారికి కూడా జీరో బిల్లుకు అవకాశం ఉండగా వారు కూడా అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. రేషన్‌కార్డు ఉన్న ఇతర జిల్లాల వారు ప్రజాపాలన సమయంలో తమ స్వగ్రామంలో దరఖాస్తు చేసుకున్నారు. అయితే రెండోసారి దరఖాస్తు చేసిన సమయంలో ఇక్కడ కరెంటు మీటరు నెంబరును అప్‌గ్రేడేషన్ చేయించుకునేందుకు వెళ్లగా.. వారు ఎక్కడైతే దరఖాస్తు చేసుకున్నారో అక్కడకు వెళ్లాలని చెప్పగా.. అక్కడకు వెళ్లి మీటరు నెంబరు కొడితే సదరు జిల్లా పరిధి కాని కరెంట్ మీటరు నెంబరు అంటూ వెనక్కి పంపుతున్నారు. ఇలా వందలమంది ఇబ్బందులు పడుతూ వెనుదిరిగిన సంఘటనలు ఉన్నాయి.

అయితే ప్రస్తుతం అర్హులుగా లేనివారు కోడ్ ముగిసే వరకు ఆగాల్సిందేనంటూ కార్యాలయాలకు వెళ్లిన వారికి సమాధానం ఇస్తున్నారంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో రేషన్ కార్డులతో లెక్కిస్తే మరో 25 శాతం వరకు లబ్ధిదారులు అర్హులుగా ఉండే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తోంది. సుమారు 2 లక్షలమంది అర్హులకుగాను సగటున 100 యూనిట్లకు లెక్కిస్తే నెలకు రూ.5.50 కోట్ల వరకు పేదలపై భారం పడనున్నట్టు తెలుస్తోంది. అలానే ప్రస్తుత ఎన్నికల కోడ్ ముగిసే మూడు నెలల కాలంలో ఒక్కో కుటుంబం ఒక్క సిలిండర్ సబ్సిడీకి దూరమైనా కూడా రూ.6కోట్ల వరకు ఆయా లబ్ధిదారులు నష్టపోయే అవకాశం ఉన్నట్టు భావిస్తున్నారు.

అక్రమ నగదు, మద్యంపై నిఘా

- ఎన్నికల వేళ శాంతిభద్రతల పరిరక్షణ ముఖ్యం
- అనుమానితులను బైండోవర్ చేయాలి
- లైసెన్స్‌డ్ ఆయుధాలను పోలీసుస్టేషన్లలో డిపాజిట్ చేయించాలి
- పోలీసు కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మం క్రైం, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా పోలీసు అధికారులతో బుధవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీపీ మాట్లాడారు. ముందు జాగ్రత్తగా హిస్టరీ షీటర్లు, చెడునడత కలిగిన రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని, అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

నేరాలకు పాల్పడకుండా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేయాలని సూచించారు. అక్రమ నగదు, మద్యం ప్రలోభాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 12 ఎఫ్ఎస్టీ, 15 ఎస్ఎస్టీ, 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, 10 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశామని, వీటి వద్ద 24 గంటల నిఘా ఉండాలన్నారు. తనిఖీల సందర్భంగా సాధారణ ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆయుధాల లైసెన్స్ కలిగి ఉన్నవారు వెంటనే వాటిని స్థానిక పోలీసుస్టేషన్లలో డిపాజిట్ చేయాలని, యువతతో సమావేశాలు నిర్వహించి సి-విజిల్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏఎస్పీ అవినాష్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటు.. వజ్రాయుధం!

భద్రాచలం ఐటీడీఏ పీవో, ఏఆర్‌వో ప్రతీక్ జైన్



మణుగూరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మణుగూరు, మార్చి 20: 'ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది వజ్రాయుధం.. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా నచ్చిన వారికి వేసుకోవాలి..' అని భద్రాచలం ఐటీడీఏ పీవో, పార్లమెంట్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్ పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో బుధవారం ఓటుపై అవగాహన-చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ర్యాలీని ప్రతీక్‌జైన్ ప్రారంభించారు. మణుగూరు డిగ్రీ కాలేజి విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. 'ఏ ఓట్ ఫర్ బెటర్ ఇండియా' అనే స్లోగన్ రాసిన టీ షర్టులను అందరూ ధరించారు. ర్యాలీ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌కు చేరుకున్న తర్వాత మానవహారం నిర్వహించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న వారితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి, తహసీల్దార్లు రాఘవరెడ్డి(మణుగూరు), స్వర్ణ(అశ్వాపురం), సూర్యనారాయణ(పినపాక), నాగప్రసాద్(కరకగూడెం), డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మణుగూరు సీఐ సతీష్ కుమార్, అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి, పినపాక సీఐ కరుణాకర్, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 15 వరకు ఓటు నమోదు



ఖమ్మం కలెక్టరేట్, మార్చి 20: పార్లమెంట్ ఎన్నికలు మే 13న జరగనుండగా ఏప్రిల్ 15 వరకు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఓటర్లు ఈలోగా జాబితాలో ఓటు ఉందో? లేదో? పరిశీలించుకుని.. లేనిపక్షంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇతర ప్రాంతాలనుంచి ఇక్కడికి వచ్చినవారు లేదా ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకొని వారు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అంటే జాబితాలో కేవలం కొత్తగా ఓటు నమోదుకోసం మాత్రమే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఓటర్ల జాబితాలో పేరు లేనివారు కొత్తగా నమోదు చేసుకోవాలనుకుంటే ఫారం-8 దరఖాస్తును ఆన్‌లైన్‌లో కానీ నియోజకవర్గ ఎన్నికల అధికారి నేరుగా దరఖాస్తు చేసుకునే వీలుకల్పించినట్టు కలెక్టర్ తెలిపారు. ఓటు నమోదుకు www.ceotelangana.nic.in, www.voters.eci.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, ఓటు ఉందో లేదో తెలుసుకోవడానికి ww.nvsp.in, www.ceotelangana.nic.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.



సీఎంను కలిసిన మువ్వా

స్టేట్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మువ్వా విజయ్‌బాబు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మంత్రి పొంగులేటి సమక్షంలో కుటుంబ సమేతంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. - సత్తుపల్లి



కమల దళం గాలం

ఖమ్మం ఎంపీ అభ్యర్థిపై కొనసాగుతున్న బీజేపీ కసరత్తు

- ఇతర పార్టీల నుంచి బడా నేతల కోసం నిరీక్షణ
- ఇప్పటికే రేసులో జలగం వెంకట్రావు
- సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వరరావు బీజేపీ తరపున బరిలోకి దిగుతారని ప్రచారం

ఖమ్మం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీ ఎన్డీయే కూటమిలో తెలుగుదేశం, జనసేన పార్టీలు చేరడంతో ఇప్పుడు ఖమ్మం లోక్‌సభ బీజేపీ టికెట్‌కోసం పోటీ పెరిగింది. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో నామమాత్రంగా ఓట్లు తెచ్చుకున్న బీజేపీ ఈసారి ఖమ్మం లోక్‌సభ ఎన్నికలపై గురి పెట్టింది. ఇందుకోసం టికెట్ విషయంలో గతంలో వలే పాత నాయకులకు కాకుండా కొత్త నాయకుల పైన దృష్టి సారించింది. మహబూబాబాద్ లోక్‌సభ టికెట్ ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎంపీ సీతారాంనాయక్‌కు కేటాయించగా.. ఖమ్మం లోక్‌సభ విషయంలో కొత్త వారికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ అధిష్టానం భావిస్తోంది. అందులో భాగంగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన పెద్ద నేతలు ఎవరైనా వస్తే వారికి టికెట్ ఇచ్చే ఆలోచనలో బీజేపీ ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కుమారుడు వెంకటరావు బీజేపీలో చేరారు. దాదాపు ఆయనకు ఖమ్మం టికెట్ ఖరారవుతుందన్న నేపథ్యంలో పెండింగ్‌లో పెట్టారు. బీఆర్ఎస్ నుంచి ముఖ్య నేతలను బీజేపీలోకి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతుంది.

వాస్తవానికి ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటన జరిగిన తర్వాత నామా లోక్‌సభ స్థాయిలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ నుంచి పోటీకి ఆయన రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తాజా రాజకీయాల నేపథ్యంలో ఆయన బీఆర్ఎస్ నుంచి రంగంలో ఉంటారా లేక బీజేపీ, టీడీపీ కూటమి వైపు వెళతారా అన్నది ఆయన నిర్ణయాన్ని బట్టి ముడిపడి ఉంది. ఈ కోణంలోనే జలగం వెంకటరావుకు టికెట్ ఖరారు చేయలేదని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల సమయం ఇంకా ఉన్నందున ముందే టికెట్ ఖరారు చేసేదాని కంటే మరికొంత కాలం వేచి ఉండి బీఆర్ఎస్ నుంచి ముఖ్యులు వస్తే వారికి టికెట్ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దేవకి వాసుదేవరావుకు 20,488 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇప్పుడు టీడీపీ, జనసేన పొత్తు ఉన్నందున మోదీ ఇమేజ్‌తో గణనీయమైన ఓటుబ్యాంకు అభ్యర్థిని బట్టి చీల్చే అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యమైన నేతలు కాకుండా స్థానిక నాయకులకు టికెట్లు ఇస్తే ఇతర పార్టీలపై ప్రభావం ఉండబోదని, సాంప్రదాయ ఓటుబ్యాంకు మాత్రమే పార్టీకి లభించే అవకాశం ఉందని పార్టీ అధిష్టానం భావిస్తోంది. దీంతో కొత్త వారికోసం, బలమైన అభ్యర్థుల కోసం బీజేపీ ఎదురు చూస్తుండడంతో అభ్యర్థి ఎంపిక మరికొంత జాప్యం అవుతోంది. జిల్లాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటుబ్యాంకును చీల్చగలిగే స్థాయి ఉన్న నేతకే టికెట్ లభించే అవకాశం ఉంది.

నామా జపం

బీఆర్ఎస్ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావు పేరును ఇప్పటికే ఖరారు చేశారు. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో నామా బీజేపీలో చేరతారని, టీడీపీ పొత్తు ఉన్నందున జిల్లాలో టీడీపీతో అనుబంధం ఉన్న సామాజిక వర్గం ఓటు బ్యాంకును బదిలీ చేసేందుకు బీజేపీ అభ్యర్థిగా నామా రంగంలోకి దిగుతున్నారని, పొత్తులో టీడీపీ టికెట్ తీసుకుని పోటీ చేస్తారని కూడా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది.

శ్రుతి మించిన స్నేహం

- బాలికను గర్భవతిని చేసిన బాలుడు
- ఇద్దరూ టెన్త్ విద్యార్థులే
- పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, రేప్ కేసు నమోదు
- భద్రాద్రి జిల్లాలో కలకలం



సుజాతనగర్, మార్చి 20: వారిద్దరూ మైనర్లు... ఒకరు బాలిక.. మరొకరు బాలుడు. ఒకే పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు.. ఇద్దరి మధ్య స్నేహం శృతిమించింది.. బాలుడు ఆమెను లోబర్చుకున్నాడు.. ఫలితంగా ఆమె గర్భం దాల్చింది.. విషయం తెలిసిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాలుడిపై అత్యాచారం, పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేశారు.ఈ సంఘటన భద్రాద్రి జిల్లాలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, విశ్వసనీయ సమాచారం ప్రకారం.. సుజాతనగర్ మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలుడు, బాలిక కొంతకాలంగా సన్నిహితంగా ఉంటున్నారు. వీరిద్దరూ ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఈ నెల 18న పరీక్ష రాస్తున్న సమయంలో బాలిక పరీక్ష హాలులో కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఆమె గర్భం దాల్చినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు గట్టిగా మందలించడంతో తనతోపాటు చదువుకుంటున్న స్నేహితుడు (బాలుడు) లోబర్చుకున్న విషయాన్ని తెలిపింది. ఈ విషయంపై ఐసీడీఎస్ అధికారులు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు సమాచారం అందగా.. వారు వెంటనే కుటుంబ సభ్యుల సమక్షంలో బాలికతో మాట్లాడారు. అనంతరం బాలిక తల్లి సుజాతనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. విచారణ నిర్వహించిన ఎస్ఐ జుబేదా బేగం బాలుడిపై అత్యాచారం, పోక్సో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

దొంగిలించిన బైకుపై వెళుతూ...

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- వేలిముద్రలతో పాత నేరస్థుడిగా గుర్తింపు
- మృతుడి స్వస్థలం ఖమ్మం



హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): దొంగిలించిన బైకుపై రాంగ్ రూట్‌లో వెళుతూ ఓ పాత నేరస్థుడు మృత్యుఒడికి చేరుకున్నాడు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ రింగ్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి ప్రమాదం జరిగిందని సమాచారం అందడంతో విధుల్లో ఉన్న ఎస్ఐలు శంకర్, దయాకర్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఒంగోలు నుంచి బోయిన్‌పల్లికి వెళుతున్న మినీ లారీని బైకుపై రాంగ్ రూట్‌లో వస్తున్న వ్యక్తి ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుడిని తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. బుధవారం రాత్రి మృతుడి ఆచూకీని కనుగొనేందుకు ఆధారాల కోసం ప్రయత్నించినా ఏవీ లభ్యం కాలేదు. చివరకు మృతుడి వేలిముద్రలను సేకరించగా ఖమ్మానికి చెందిన గోపీకృష్ణ(30) అనే పాత నేరస్థుడిగా గుర్తించారు. అతడిపై ఖమ్మంలో 3 కేసులున్నట్లు తెలుసుకున్నారు. గోపీకృష్ణ మంగళవారం రాత్రి అతడు సాగర్‌రింగ్ రోడ్డు సమీపంలోని గుడిసెల్లో శత్రు అనే వ్యక్తికి చెందిన బైకును దొంగిలించాడని దర్యాప్తులో తేలింది. దొంగతనం చేసిన బైకుపై పరారవుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

6వ పేజీలో...

హెచ్‌ఎంను బెదిరించిన విలేఖరులపై కేసు

మావోయిస్టు దళసభ్యుడి లొంగుబాటు

డీసీపీఓపై ఆర్‌టీఐ కార్యకర్త ఫిర్యాదు

మూడో రోజూ మెడికోల నిరసన 7



రాజ్యసభకు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్ర.. బుధవారం ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా రవిచంద్రకు రాజ్యసభ చైర్మన్ శుభాకాంక్షలు తెలిపారు. మీ అనుభవాన్ని రాజ్యసభకు సమర్థవంతంగా అందిస్తారని చైర్మన్ విశ్వాసం వ్యక్తం చేసినట్టు వద్దిరాజు ఖమ్మం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

రాజ్యసభ చైర్మన్‌ను కలిసిన ఎంపీ రవిచంద్ర

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య


సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

ములకలపల్లి, మార్చి 20: తునికాకు ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలని, తక్షణమే టెండర్లు పిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ మండల కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తునికాకు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు, ఇతర పేదలకు రెండోపంటగా ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. తునికాకు సేకరణ సీజన్ సమీపిస్తున్న అటవీశాఖాధికారులు టెండర్ల విషయంలో జాప్యం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ముదిగొండ రాంబాబు, మాలోత్ రావుజా, పూకంటి రవికుమార్, గోగ్గల ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, మధు పాల్గొన్నారు.

పాల్వంచ సీడీపీవో డిప్యూటేషన్ రద్దు

కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 20: పాల్వంచ సీడీపీవో కనకదుర్గ డిప్యూటేషన్ రద్దు చేసి తన సొంత ప్రాంతమైన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంకు బదిలీ చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి విజేత తెలిపారు. ఇటీవల ఆమెపై వచ్చిన అవినీతి ఆరోపణలు, విధినిర్వాహణలో సిబ్బందిని వేధింపులు తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి ఆర్జేడీ వరంగల్‌కు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. విచారణ నివేదిక ఆధారంగా ఆమె డిప్యూటేషన్ రద్దు చేసి తిరుమలాయపాలెంకు బదిలీ చేయాలని ఆదేశాలు రావడంతో బుధవారం ఆమెను రిలీవ్ చేసినటు పేర్కొన్నారు.

డీసీపీవోపై ఆర్టీఐ కార్యకర్త ఫిర్యాదు

కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 20: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖలో పనిచేస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి(డీసీపీవో) తన వ్యక్తిగత అవసరాలకు ప్రభుత్వ వాహనం వినియోగిస్తుందని, విచారణ చేసి ఆమెపై చర్యలు తీసుకోవాలని కొత్తగూడేనికి చెందిన ఆర్టీఐ యాక్టివిస్టు షేక్ నయీం బుధవారం జిల్లా సంక్షేమ అధికారి విజేతకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాలల సరంక్షణ కోసం ఆపదలో ఉన్న బాల, బాలికలను కాపాడేందుకు ఏర్పాటు చేసిన బాల రక్షక్ వాహనం (1098)ను ఆదే డిపార్టుమెంట్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న డీసీపీఓ తన వ్యక్తిగత కేసులో సాక్షం నిమిత్తం కొత్తగూడెం కోర్టుకు వాహనంలో వచ్చారన్నారు. గతంలోనైతం ఈ వాహనాన్ని ములుగు జిల్లాలోని సమ్మక్క సారలమ్మ దేవాలయం మేడారం తీసుకెళ్లారని తెలిపారు. అప్పట్లో అప్పటి ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి విషయంపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

హెచ్‌ఎంను బెదిరించిన ఇద్దరు విలేకరులపై కేసు

కారేపల్లి, మార్చి20: విధుల్లో ఉన్న ప్రధానోపాధ్యాయుడిని బెదిరించిన ఇద్దరు విలేకరులపై ఖమ్మం జిల్లా కారేపల్లి పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రాజారామ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన ఆదాబ్ హైదరాబాద్, తెలంగాణ కెరటం పత్రికలకు చెందిన ఇద్దరు విలేకరులు గోవింద వెంకటేశ్వర్లు, జిల్లపల్లి వెంకటేశ్వర్లు కారేపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రెండురోజుల క్రితం వెళ్లారు. స్కూల్‌లో విధుల్లో ఉన్న హెచ్‌ఎం గణపారపు వెంకటేశ్వర్లను కలిసి ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ చూపించాలని కోరారు. అయితే తాను రిజిస్టర్‌ను చూపించడం కుదరదని హెచ్‌ఎం చెప్పారు. అయినా వినని సదరు విలేకరులు హెచ్‌ఎంను బెదిరించి హాజరు రిజిస్టర్‌ను తెరిచి అందులోని వివరాల ఫొటోలు తీసుకున్నారు. దీంతో దౌర్జన్యంగా వ్యవహరించిన ఇద్దరు విలేకరులపై బుధవారం హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారామ్ తెలిపారు.

జర్నలిస్టులపై పెట్టిన కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్, మార్చి 20: ఖమ్మం నగరానికి చెందిన విలేకరి ఆకుతోట ఆదినారాయణతో పాటు మరో ముగ్గురిపై నమోదైన కేసులో సరైన సాక్ష్యాలు లేకపోవడంతో వారిని నిర్దోషులుగా విడుదల చేస్తూ ఖమ్మం మూడో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయమూర్తి వినుకొండ మాధవి బుధవారం తీర్పు వెల్లడించారు. ఖమ్మానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి మాటేటి కిరణ్‌కుమార్ 2021 మార్చి 14న ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో జర్నలిస్టులపై సోషల్ మీడియా వేదికగా కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు పథకం ప్రయత్నించారని ఫిర్యాదు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి వారిపై నేరం రుజువుకాకపోవడంతో కేసును కొట్టివేస్తూ తీర్పు వెల్లడించారు.

ఇసుక లారీ పట్టివేత

తల్లాడ, మార్చి 20: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని తల్లాడ మండలం మిట్టపల్లి వద్ద బుధవారం పోలీ సులు పట్టుకున్నారు. విజయవాడ కృష్ణానది నుంచి ఖమ్మం నగరానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఎస్‌ఐ కొండల్‌రావు వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. ఈమేరకు లారీ యజమాని అప్పారావు, డ్రైవర్ తిరుప తిరావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మామిడిగుండాలలో నిలిచిన సీలింగ్ భూముల సర్వే


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఇల్లెందురూరల్, మార్చి20: మామిడిగుండాల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 130లో గల 4,200 ఎకరాల సీలింగ్ భూములపై హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా సర్వేయర్ తాటి ధర్మారావు ఆధ్వర్యంలో బుధవారం సర్వే చేపట్టగా, స్థానిక గిరిజన రైతులు అడ్డుకున్నారు. సీలింగ్ చట్టం ప్రకారం గిరిజనులకు అందించిన 2,800 ఎకరాల భూమికి హద్దులు పెట్టి మిగిలిన తమ భూమిని అప్పగించాలని పట్టాదారులు రెవెన్యూ అధికారులను కోరగా, తమ సాగులో ఉన్న భూములను అప్పగించేది లేదని గిరిజన రైతులు అడ్డు చెప్పడంతో అధికారులు సర్వేని నిలిపివేశారు. ఈసమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి రిమాండ్

ఆళ్లపల్లి, మార్చి 20: పాత కక్షల నేపథ్యంలో మండల పరిధిలోని రాయిపాడు గ్రామానికి చెందిన వాసం రవీందర్ అనే వ్యక్తి, రమేష్ అనే వ్యక్తిపై మార్చి 14న గొడ్డలితో దాడి చేశాడని పోలీసులు తెలిపారు. హత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటనలో రవీందర్‌ను ఎస్‌ఐ రతీష్ బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఒకే గ్రామానికి చెందిన వీరి ఇద్దరి మధ్య పాత కక్షలు ఉన్నాయని తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ తలిపారు.

రైల్వేలైన్ కోసం మార్కింగ్



రోడ్డుపై వేసిన నంబర్లు

ఖమ్మం రూరల్, మార్చి 20: ఖమ్మం రూరల్ మండలంలో ఇటీవల రెండు రోజులుగా అధికారులు రహదారులపై ఎస్‌సీపీ అని నలుపు, తెలుపు రంగులతో కూడిన మార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. డోర్నకల్ నుంచి సూర్యాపేట మీదుగా గద్వాల వరకు నూతనంగా నిర్మించనున్న రైల్వేలైను కోసం అధికారులు మార్కింగ్ చేసినట్లు తెలుస్తోంది. గతంలో డోర్నకల్ నుంచి మిర్యాలగూడెం మీదుగా యాదాద్రి పవర్‌ప్లాంట్ కోసం రైల్వేలేను ఏర్పాటుకు గతంలో ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లో అధికారులు సర్వే చేపట్టారు. ప్రస్తుతం డోర్నకల్ నుంచి గద్వాల రైల్వేలైన్‌కోసం అధికారులు మార్కిం గ్ చేయటం విశేషం. రైల్వేలైన్ వస్తే తమ భూముల ధరలు అమాంతం పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్కింగ్‌లు ఎంవీపాలెం, కాచిరాజుగూడెం మధ్య ఎస్‌సీపీ 113, ఆరెకోడు, చింతపల్లి మధ్య ఎస్‌సీపీ 112 అని నంబర్లు ఏర్పాటు చేశారు.

యువకుడి ఆత్మహత్య

బోనకల్, మార్చి 20: మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బోళ్ల గోపి(24) బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు కొద్ది కాలంగా కూలీ పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో బోనకల్ రైల్వే స్టేషన్ సమీపంలో గల ట్రాక్ వద్ద మృతి చెంది ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

నిధులు మంజూరయ్యేదెప్పుడో..

» అయోమయంలో లంకాసాగర్ ప్రాజెక్టు రైతులు » పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని కాల్వలు, తూములు » పట్టించుకోని అధికారులు


కూలేందుకు సిద్ధంగా ఉన్న వాక్‌వే బ్రిడ్జి

పెనుబల్లి, మార్చి 20: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు అయిన లంకాసాగర్ పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఆయకట్టు రైతుల చివరి భూములకు నీరందక ఇబ్బందులు పడుతున్నారు. పెనుబల్లి, వేంసూరు మండలాల మధ్యన కట్టలేరు వాగుపై 1968లో లంకాసాగర్ ప్రాజెక్టును నిర్మించారు. దీనికి కుడికాల్వ 18కిలోమీటర్లు, ఎడమ కాల్వ 13కిలోమీటర్లు పొడవునా నిర్మించి సుమారు 15గ్రామాలకు 5,300హెక్టార్లు ఆయకట్టుతో స్థిరీకరించారు. నాటి నుంచి అనేక ఏళ్లపాటు సుమారు పదివేలకు పైగా ఎకరాల్లో రెండు పంటలకు పుష్కలంగా నీరందించేది. ప్రాజెక్టుకు నీటి ఎద్దడిని నివారించేందుకు 2000వ సంవత్సరంలో అప్పటి మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు కేవలం 18రోజుల్లోనే ఎన్నెస్పీ ఎడమ ప్రధాన కాల్వ నుంచి లంకాసాగర్‌లోకి నీటిని పంపే విధంగా లింక్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రాజెక్టుకు అవసరం ఉన్న సందర్భాల్లో నీటిని పంపే ప్రయత్నం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగి 50ఏళ్లు పూర్తయింది. కానీ పూర్తిస్థాయిలో ఆనకట్ట, అలుగు, కాల్వలకు మరమ్మతులు జరుగకపోవడంతో కొన్ని సందర్భాల్లో ప్రాజెక్టులో నీరున్నప్పటికీ ఆయకట్టుకు నీరు చేరడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ప్రాజెక్టును రాష్ట్ర డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ సభ్యులు సందర్శించి ఆనకట్ట, వాక్‌వే బ్రిడ్జి, అలుగుపై గేట్లు, కాల్వలు, తూములు తదితర వాటికి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఆరునెలల క్రితం నీటిపారుదలశాఖ అధికారులు సుమారు రూ.25కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు త యారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. కానీ ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. దీంతో వర్షాకాలంలో ఆనకట్ట బలహీనంగా ఉండటంతో వర్షాలు ఎక్కువగా కురిసి అలుగుపై నాలుగు అడుగులకు పైగా వరద ప్రవహిస్తే ఆయకట్టు లోతట్టు గ్రామాలైన గణేశులపాడు, లంకాశేషయ్యబంజర్లు కొట్టుకుపోయే ప్రమాదముందని రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి లంకసాగర్ ప్రాజెక్టుకు నిధులు వెచ్చించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


మరమ్మతులకు నోచుకోని కాల్వలు


చెట్లతో నిండిన కాల్వలు

క్రాఫ్ హాలిడే ప్రకటించినా
మరమ్మతులు చేపట్టలేదు: రైతులు

ఈ ఏడాది లంకా సాగర్ ప్రాజెక్టు పరిధిలో రైతులు యాసంగి సాగు చేయవద్దని అధికారులు ఆదేశించడంతో పంటలను సాగుచేయలేదు. ఈ పరిస్థితుల్లో నిధులు మంజూరు చేసి వేసవిలోనే ఆనకట్ట, వాక్‌వే బ్రిడ్జి, డ్రాప్‌లు, గేట్లు, కాల్వలకు మరమ్మతులు చేపట్టి చివరి భూములకు కూడా నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పన్ను తగ్గింపుపై ఉన్నతాధికారుల ఆగ్రహం

» వైరా మునిసిపల్ ఉద్యోగిపై వేటుకు రంగం సిద్ధం...?

» ఆడియోతో వెలుగుచూసిన అవినీతి

వైరా, మార్చి 20: వైరా మునిసిపాలిటీలో నాలుగేళ్ల నుంచి డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఓ ఉద్యోగి అవినీతి అక్రమాల చిట్టా గుట్టురట్టయింది. కమిషనర్ లాగిన్‌తో అడ్డగోలుగా రివిజన్ పేరుతో ఓ పెట్రోల్ బంకు యజమాని నుంచి వేలాది రూపాయలు ముడుపులు దండుకొని పన్ను తగ్గించిన వ్యవహారంతో వెలుగులోకి వచ్చింది. సత్తుపల్లి మునిసిపాలిటీలో యూడీసీగా పనిచేస్తున్న శ్రీనివాసరావు డిప్యూటేషన్‌పై నాలుగేళ్ల నుంచి వైరా మునిసిపాలిటీ యూడీసీగా కొనసాగుతున్నారు. ఆయనపై గతంలో కూడా అనేక ఆరోపణలున్నాయి. 'మనోడే తగ్గించేయ్!' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో వైరా మునిసిపాలిటీలో పన్నుల తగ్గింపు వ్యవహారంపై కథనం ప్రచురితమైంది. దాంతో జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ వైరా మునిసిపల్ కమిషనర్ వేణును వివరణ కోరారు. మునిసిపాలిటీలో చోటుచేసుకున్న పరిణామాలపై కమిషనర్‌ను ప్రశ్నించారు. రివిజన్ పేరుతో పన్నులు తగ్గించటంపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనేక వ్యవహారాల్లో తలదూర్చుతూ, నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారనే వ్యవహారం కూడా అదనపు కలెక్టర్ దృష్టికి వచ్చింది. దాంతో సదరు యూడీసీపై వేటుకు రంగం సిద్ధమైందని సమాచారం.

ఖమ్మం రోడ్డులోని జశ్వంత్ ఫిల్లింగ్ స్టేషన్‌కు రివిజన్ పేరుతో పన్ను తగ్గించటానికి మునిసిపాలిటీకి చెందిన ఒక బిల్ కలెక్టర్‌ను మధ్యవర్తిగా పెట్టి సదరు ఉద్యోగి రూ.25వేలు తీసుకున్నట్లు ఆబంకు స్థల యజమాని మునిసిపల్ సిబ్బందికి మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ ముడుపుల సంభాషణలు మొత్తం ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లినట్లు సమాచారం. బంకుకు పన్ను తగ్గించేందుకుగానూ సదరు ఉద్యోగి రూ.50వేలు డిమాండ్ చేసి, ఆతర్వాత రూ.25వేలు ముడుపులు పుచ్చుకొని తనదగ్గర ఉన్న కమిషనర్ లాగిన్‌తో రూ.95వేల పన్నును ఏకకాలంలో తగ్గించారు. ఈ వ్యవహారం బయటకు రావడంతో సదరు ఉద్యోగిపై కమిషనర్ ఆగ్రహం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఈ వ్యవహారంపై కమిషనర్, ఉద్యోగి మధ్య వాగ్వాదం కూడా జరిగినట్లు సమాచారం. కమిషనర్‌కు ఈ విషయంలో అవగాహన లేదని కూడా సదరు ఉద్యోగి బహిరంగంగానే వ్యాఖ్యలు చేయటం విశేషం. రూ.1.32లక్షల ట్యాక్స్‌ను కేవలం రూ.37,720కు తగ్గించటంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే ముడుపులు ముట్టజెప్పిన అనేకమంది పన్నులు కూడా సదరు ఉద్యోగి భారీగా తగ్గించినట్లు తెలిసింది. ఈ అక్రమాలన్నీ బహిర్గతం కావడంతో ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమయ్యారు.

ఉపాధ్యాయుడిపై ఆరోపణలు

● విచారణ చేపట్టిన ఎంఈవో

కారేపల్లి, మార్చి20: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గల ప్రాథమిక మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న రామగోపి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై మండల విద్యాశాఖాదికారి జయరాజ్ బుధవారం విచారణ చేపట్టారు. ఇటీవల కాలంలో సదరు ఉపాధ్యాయుడిపై స్థానికంగా వచ్చిన ఆరోపణలపై జిల్లా అధికారుల అదేశాల మేరకు ఎంఈవో విచారణ చేపట్టారు. విచారణకు సంబంధించిన పూర్తి నివేదికను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్....

వైరా, మార్చి 20: విద్యాశాఖ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లిన మండలంలోని అష్టగుర్తి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు వై.మధుబాబును విద్యాశాఖ ఉన్నతాధికారులు బుధవారం సస్పెండ్ చేసినట్లు ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు ధ్రువీకరించారు. తన తండ్రి అనారోగ్యానికి గురయ్యారని ఆ ఉపాధ్యాయుడు ఫిబ్రవరి 13నుంచి 19 వరకు పాఠశాలకు సెలవు పెట్టారు. అనంతరం అనుమతి లేకుండానే, విదేశాలకు వెళ్లారని అందుకు ఎలాంటి అనుమతి తీసుకోకపోవడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని ఎంఈవో వివరించారు.

ఆర్టీసీ బస్సులో నుంచి కింద పడిన మహిళ

● తీవ్రగాయలు

నేలకొండపల్లి, మార్చి20: నడుస్తున్న ఆర్టీసీ బస్సు నుంచి కింద పడి ఓమహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం నేలకొండపల్లిలో జరిగింది. వివరాల ప్రకారం.. నేలకొండపల్లికి చెందిన కందరబోయిన రమాదేవి బుధవారం ఖమ్మం వెళ్లటానికి నేలకొండపల్లిలో ఆర్టీసీ బస్సు ఎక్కింది. కొంత దూరంలో బస్సు వెళ్లాక ఫుట్‌బోర్డుపై ఉన్న ఆమె బస్సులో తొక్కిసలాటతో ఒక్కసారిగా కిందపడిపోయింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఆమెను సీపీఐ మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు వైద్యశాలకు తరలించాడు.

న్యాయవాదులకు తరగతులు

ఖమ్మం లీగల్, మార్చి 20: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఈ నెల 23న శనివారం ఉదయం 11గంటలకు కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో తరగతులు నిర్వహిస్తామని ఐఏఎల్ అధ్యక్షుడు షేక్ లతీఫ్, ప్రధానకార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావులు తెలిపారు. ఈ తరగతులు ఏజెన్సీ లా ఆర్ట్ ఆఫ్ క్లాస్ ఎక్జమినేషన్‌కు సంబంధించిన విషయాలపై ఉంటాయని, అధిక సంఖ్యలో న్యాయవాదులు హాజరుకావాలని వారు కోరారు.

రూల్‌ఆఫ్ రిజర్వేషన్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నాం

● జీఎం పర్సనల్ బసవయ్య

రుద్రంపూర్, (సింగరేణి) మార్చి 20: సింగరేణి సంస్థలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని జనరల్ మేనేజరు (వెల్ఫేర్) బసవయ్య తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ల అమలుపై సమావేశానికి ప్రోగ్రాం అధికారులకు బుధవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు పదోన్నతులను కల్పిస్తున్నామని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కోసం వచ్చిన అధికారులు పార్వతీశం, సుబ్రమణ్యం, రాజేశ్వరి గురువారం శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. స్వాగతం పలికిన వారిలో జీఎం హెచ్‌ఆర్‌డీ బి. వెంకటేశ్వర్లు, చీఫ్ లైజర్ ఆఫీసర్ వీసం కృష్ణయ్య, సింగరేణి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వరరావు, ఏజీఎం మేకల కనకయ్య, డీజీఎం అజయ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు కలవల చంద్రశేఖర్, జి. మాలకొండయ్య, భూక్యా రాందాస్ తదితరులు పాల్గొన్నారు.


జనరల్ మేనేజరు బసవయ్య పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

వేతనాలు అందేదెన్నడో..

» మూడు నెలలుగా జీతాలు అందక మల్టీపర్పస్ వర్కర్ల అవస్థలు » ఆదుకోవాలని కార్మికుల వినతి



గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు

బోనకల్, మార్చి 20: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు వారివి. గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్ల నియామకాలు జరిగిన క్రమంలో భవిష్యత్‌పై గం పెడాశలతో ఆ విధులలో చేరారు. శ్రమ ఎక్కువైనా, జీతం తక్కువైనా భద్రత ఉంటుదన్న బావంతో ముందుకు సాగుతున్నారు. కాని గత మూడు నెలలుగా మల్టీ పర్పస్ వర్కర్లకు జీతాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. మేజ ర్ పంచాయతీలలో మాత్రం గత 5 నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు.

గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న వర్కర్లకు ఎఫ్‌ఎఫ్‌ఎస్, ఎస్‌ఎఫ్‌ఎస్ ద్వారా వచ్చే నిధుల నుంచి జీతాలను చెల్లించేవారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి పంచాయతీలకు నిధుల విడుదల ఆగిపోవడంతో వీరికి జీతాలు చెల్లించడంలో సమస్య నెలకొంది. ఇళ్ల, నీటి పన్నులు పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడం వలన పంచాయతీల కు ప్రస్తుతం ఎటువంటి ఆదాయం రావడం లేదని సమాచారం. దీంతో స్థానిక వనరుల ద్వారా కూడా వీరికి వేతనాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 589 పంచాయతీలు ఉండగా దాదాపు 12 వేల మంది మల్టీ పర్పస్ వర్కర్లు పని చేస్తున్నారు. వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాలలో అన్ని రకాల పారిశుధ్య పనులు నిర్వహించాల్సి ఉంటుంది. డ్రైనేజీల్లో పేరుకున్న చెత్తను తొలగించే పనుల నుంచి ఇంటింటికి మంచినీటి సరఫరా వరకు అందరికీ అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్నారు. వీరికి నెలకు రూ.9,500 వేతనం ఇస్తుండగా అది కూడా సకాలంలో ఇవ్వనందున వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అప్పులు పుట్టక, చేసే విధులు మానుకోలేక కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులకు పలుమార్లు వేతనాల విడుదల కోసం విన్నపాలు ఇచ్చినా తమ గోడు ఆలకించిన వారు లేరని వాపోతున్నారు. తమ పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేసి ఆదుకోవాలని మల్టీ పర్పస్ కార్మికులు కోరుతున్నారు.

5 నెలలుగా జీతాలు లేవు



● మరీదు పుల్లయ్య, మల్టీపర్పస్ వర్కర్ల మండల అధ్యక్షుడు

5 నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. మండలంలో 86 మంది వర్కర్లు పని చేస్తున్నారు. బోనకల్, రావినూతల, ముష్టికుంట్ల మేజర్ పంచాయతీలలో వర్కర్లకు జీతాలు అందక పోవడంతో కు టుంబాల పోషణ భారంగా మారింది. మిగిలిన పంచాయతీలలో కూడా 3 నెలలుగా వేతనాలు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి జీతాలను విడుదల చేయాలి.

అవస్థలు పడుతున్నాం



● అంతోటి రమేష్, మల్టీ పర్పస్ వర్కర్ల మండల ఉపాధ్యక్షుడు

జీతాలందక, అప్పులు పుట్టక అవస్థలు పడుతున్నాం. ఆర్థిక ఇబ్బందులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంచాయతీల్లో పని చేస్తే భవిష్యత్ ఉంటుందని అనుకున్నాం. కాని పరిస్థితి చూస్తే అప్పు ఇచ్చే వాడు లేక అవసరాలు తీరే మార్గం లేక బతుకు బండి భారంగా మారింది.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని దాడి

● మద్యాన్ని లూటీ చేసిన మద్యం ప్రియులు

టేకులపల్లి, మార్చి 20: అధిక ధరలకు మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నారని పేర్కొంటూ టేకులపల్లి మండల కేంద్రంలోని మద్యం దుకాణాలపై బుధవారం మద్యం ప్రియులు దాడులు నిర్వహించి మద్యాన్ని ఎత్తుకెళ్లారు. టేకులపల్లిలో క్రాంతి, పల్లవి-1 పల్లవి-2, గణేష్ పేరున నాలుగు మద్యం దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఈ దుకాణాల్లో నిన్నటి వరకు ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించారని, దుకాణాదారులు సిండికేట్‌గా ఏర్పడి బుధవారం నుంచి సిండికేట్ విక్రయాలు మొదలు పెట్టారని ఆరోపించారు. బాటిల్‌పై అదనంగా రూ.20లు తీసుకొంటున్నారని మద్యం ప్రియులు పేర్కొన్నారు. దీంతో ఎక్కువ ధరకు మద్యం అమ్మకాలు చేస్తున్నారని పేర్కొంటూ పల్లవి-1 మినహా మూడు మద్యం దుకాణాలపై దాడులు చేసి అందిన కాడికి మద్యాన్ని ఎత్తుకుపోయారు. ఇదే అదునుగా భావించిన బాటసారులు కూడా మద్యం ప్రియులకు జత కలిసి దుకాణాల్లోని మద్యం పెట్టెలను ఎత్తుకెళ్లారు. లక్షల రూపాయల విలువ గల మద్యాన్ని లూటీ చేసినట్టు మద్యం వ్యాపారులు తెలిపారు. ఈ విషయమై టేకులపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మద్యం దుకాణాలను ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐ కరుణాకర్‌లు పరిశీలించారు.


ఆందోళన చేస్తున్న మద్యం ప్రియులు

పేకాట రాయుళ్ల అరెస్టు

● రూ.9,310 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం

బూర్గంపాడు, మార్చి 20: బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పంచాయతీలో గల భాస్కర్‌నగర్ శివారులో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, ఒకరు పరారయ్యారు. వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.9,310లు నగదు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మావోయిస్టు దళ సభ్యుడి లొంగుబాటు

కొత్తగూడెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ చర్ల-శబరి ఏరియా కమిటీ సభ్యుడు మడివి బుద్ర అలియాస్ కృష్ణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట బుధవారం లొంగిపోయారు. ఎస్పీ రోహిత్‌రాజు లొంగిపోయిన మావోయిస్టు పార్టీ కమిటీ సభ్యుడి వివరాలను విలేకరుల సమావేశంలో వివరించారు. లొంగిపోయిన మావోయిస్టు సభ్యుడు చర్ల మండలం ఎర్రంపాడు గ్రామానికి చెందిన వాడని తెలిపారు. 2010 వసంవత్సరంలో చర్ల-శబరి ఏరియాకమిటీలో చేరిన మడివి బుద్ర 2015వ సంవత్సరం వరకు దళసభ్యుడిగా పని చేసినట్లు తెలిపారు. 2015లో ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది తెలంగాణ మావోయిస్టు పార్టీ ప్రెస్‌టీమ్ బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చేపట్టిన 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమంలో భాగంగా దుమ్ముగూడెం పోలీసులు, 141 బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ సిబ్బంది నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు ఆకర్షితుడైన మడివి బుద్ర స్వచ్ఛందంగా భద్రాద్రి లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇతడినిపై రూ.4లక్షల రివార్డు ఉందని తెలిపారు. లొంగిపోయిన దళసభ్యులకు జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరపున అందవల్సిన అన్ని రకాల ప్రతిపాదనలను అందించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని అన్నారు.


కృష్ణకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

రోడ్డు భద్రతా చర్యలు


తోగ్గూడెం సమీపంలోని మల్లేపూల వాగు బ్రిడ్జిపై పేయింటింగ్ వేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్, మార్చి20: రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు రోడ్డు భద్రతా చర్యలను చేపట్టారు. ఈ క్రమంలో రోడ్లపై గుంతలను పూడ్చటం, మరమ్మతులు చేయడం, బ్రిడ్జిలపై పెయింటింగ్, రోడ్డు మధ్యలో వైట్ లైన్, డేంజర్ లైట్స్, జీబ్రా క్రాసింగ్, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు తదితర ప్రమాద నివారణ చర్యలను చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ జేఈ నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. తాజాగా పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డు నుంచి కాకర్లపల్లి, రుద్రాక్షపల్లి, బుగ్గపాడు ప్రధాన రహదారులపై నివారణ చర్యలు చేపట్టారు.

శునకం మెడకి ఇరుక్కున్న ప్లాస్టిక్ డబ్బా

● తొలగించిన జంతుప్రేమికులు

భద్రాచలం, మార్చి 20: భద్రాచలంలో ఓ శునకం మెడకి ప్లాస్టిక్ డబ్బా ఇరుక్కుని మూడు రోజులుగా ఇబ్బంది పడుతోంది. ఈ విషయం తెలిసిన వెంటనే జంతు ప్రేమికులు బుధవారం పట్టణ పోలీసు స్టేషన్ ప్రాంగణంలో శునకం సేద తీరుతుండగా పట్టుకొని దానికి ఉన్న ప్లాస్టిక్ డబ్బాను తొలగించారు. జంతు ప్రేమికులు ఎలిపే ఉదయ్ కుమార్, సాయి, పంచాయతీ సిబ్బంది గడ్డం వెంకట్, వజీర్‌ల సహకారం అందించడంతో శునకానికి ఉన్న డబ్బా నుంచి విముక్తి కలిగింది.


శునకం మెడకు ఉన్న డబ్బాను తొలగిస్తున్న దృశ్యం



కాటేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

భద్రాద్రి దేవస్థానం పరిధిలో మరో కాటేజ్

» నిర్మాణానికి ముందుకు వచ్చిన నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ

భద్రాచలం, మార్చి 20: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిధిలో మరో కాటేజీ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ యాజమాన్యం సుమారు రూ.రెండు కోట్లతో ఈ కాటేజీ నిర్మాణం చేపడుతున్నారు. జీ+2 పద్ధతిలో ఈ కాటేజీని రంగనాయకుల గుట్టపై నిర్మాణం సాగనుంది. ఇందుకు సంబంధించిన పనులకు భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఎన్‌సీసీ యాజమాన్యం తరపున భద్రాద్రి దేవస్థానం విశ్రాంత కార్యనిర్వహణాధికారి వేగేశ్న రామకృష్ణంరాజు దంపతులు భూమిపూజ నిర్వహించారు. ఈ భవన నిర్మాణం ఏడాది కాలంలో పూర్తి చేసేందుకు నిర్వాహకులు చర్యలు చేపట్టనున్నారు.

మధిర బార్ అధ్యక్షుడిగా పుల్లారావు



మధిర, మార్చి 20: మధిర బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బోజెడ్ల పుల్లారావు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బార్ ఎన్నికల్లోబాగంగా అధ్యక్షపదవికి బోజెడ్ల పుల్లారావు, కోశాధికారి పదవికి కాకాని విజయ్‌కుమార్ ఒక్కొక్కరే నామినేషన్లు వేయడంతో వారిరువురు ఏకగ్రీవం అయ్యారు. నేటితో నామినేషన్ల పర్వం ముగిసింది. మొత్తం 9నామినేషన్లు దాఖలయ్యాయి. ఇతర పదవులైన ప్రధాన కార్యదర్శిపదవికి 3, ఉపాధ్యక్షపదవికి 2, సహాయకార్యదర్శికి 2 నామినేషన్లు రావడంతో ఈ పదవులకు పోటీ జరుగుతుంది. ఈనెల 22న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆతర్వాత అవసరమైతే ఇతర పదవులకు ఈనెల 28న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి సి. గోపాల్ ప్రకటించారు.

రాములోరి గోటి తలంబ్రాల ఊరేగింపు



రాములోరి తలంబ్రాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఏన్కూరు, మార్చి 20: రాములోరి గోటి తలంబ్రాలను బుధవారం తూతక్కలింగన్నపేట రామాలయ కమిటీ ఆధ్వర్యంలో పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలునిర్వహించి అనంతరం కోలాటాలు, నృత్యాలతో ఊరేగింపు చేశారు. అనరంతరం గోటితలంబ్రాలను కాలినడకన భద్రాచలం వెళ్లి రాములవారికి సమర్పించనున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇల్లూరి ఆదినారాయణ, ఆళ్ల చిన్న సుబ్బారావు, వెల్లంకి లక్ష్మీనరసయ్య, కట్ట నాగేశ్వరరావు, ఆదినారాయణ, వైదేహిపాల్గొన్నారు.

ఈసారి మామిడికి అనుకూలమే..

» మెళకువలతోనే అధిక దిగుబడి..

» మార్చిలో జాగ్రత్తలు పాటించడమే కీలకం



ఖమ్మం వ్యవసాయం, మార్చి 20: ఆరుగాలం కష్టపడి రైతు పండించే పంటలు చేతికందేలోపే చీడపీడల బారిన పడితే ఆ రైతుకు తీరని నష్టం జరుగుతుంది. ఒక్క రైతుకే కాదు, ఆ కుటుంబానికీ తీవ్ర నష్టం వాటిల్లుతుంది. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటది అనే నానుడిని నిజం చేయాలంటే.. మొదట రైతును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకు ఉద్యాన అధికారులుతమ వంతుగా మామిడి రైతుల కోసం పలు సూచనలు, సలహాలు పాటిస్తే ఈ సీజన్‌లో అధిక దిగుబడులు పొందవచ్చని చెబుతున్నారు. ఈ ఏడాది మామిడికి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నా, మార్చి నెలలో తగు జాగ్రత్తలు పాటిస్తేనే అధిగ దిగుబడి పొందవచ్చని అంటున్నారు.

35వేల ఎకరాల్లో తోటలు

జిల్లాలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, కొణిజర్ల, రఘునాథపాలెం, ఎర్రుపాలెం, చింతకాని, ముదిగొండ మండలాల్లో మామిడి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. జిల్లాలో ఈ ఏడాది 35వేల ఎకరాల్లో మామిడి తోటలు ఫలసాయం అందించ నున్నాయి. మామిడి ప్రస్తుతం పిందె, కాత దశలో ఉంది. అయితే పిందె, కాయలపై తేనె మంచు, కాండం తొలుచు, కాయ తొలుచు పురుగులు, మసిమంగు, పిండి నల్లి, బూడిద తెగుళ్ల అధికంగా కనిపిస్తున్నాయి. వెంటనే తగు జాగ్రత్తలు పాటించకపోతే అపార నష్టం వాటిల్లుతుంది. కాయ పెరుగుదల దశలో వీలైనంత వరకు డ్రిప్ ద్వారా చెట్టుకు నీరందించాలి. కాయలకు కవర్ తొడుగు ఉంచడంతో ఆరోగ్యంగా పెరుగుతాయి.

తేనె మంచు పురుగు

ఈ పురుగు ఆకు, పువ్వు, పిందెలపై చేరి రసాన్ని పీలుస్తాయి. పూత, పిందె వాడిపోయి రాలిపోతుంది. పురుగు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై మసి గల శిలీంద్రాలు పెరుగుతాయి. దీంతో నల్లని మసిమంగు ఏర్పడుతుంది. ఈ పురుగు కాయ లేని కాలంలో కొమ్మల బెరడులో దాగి ఉంటుంది. అనంతరం లేత ఆకులపై, పూరెమ్మలపై ఉంటుంది. వాతావరణ పరిస్థితుల్లో హెచ్చుతగ్గులు, అంటే చలిగా ఉన్నపుడు ఎక్కువ ఉధృతి పెరుగుతుంది. తేనెలాంటి బంక ఆకులపై చేరడంతో సూర్యరశ్మి వెలుగులో మెరుస్తుంది. తేనె మంచు నివారణకు లీటర్ నీటిలో డైమిథోయేట్ 2 మి.లీ లేదా క్లోరిపైరిపాస్ తగు మోతాదులో నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

ఈ తెగులు ఆకుపై, పూరెమ్మలపై బూడిద వంటి తెల్లని పదార్థం వ్యాపించి పూత, పిందె రాలిపోతుంది. ఇది పూత కాలంలో కనబడుతుంది. నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు, లేదా కెరాథేన్ మి.లీ కలిపి పిచికారి చేయాలి.

తెగుళ్లు, మసిమంగు

ఆకులు, పూత, పిందెలు, కాయలపై రసం పీల్చే తేనె మంచు పురుగు, పిండినల్లి, తామర పురుగులు, చీడపీడలు ఆశించినప్పుడు (సోకినప్పుడు).. అవి విసర్జించిన తేనెలాంటి పదార్థంపై శిలీంద్రాలు క్యాప్‌నోడియం పరాన్న భుక్కులుగా పెరిగి నల్లని మసి తెగుళ్ల వస్తాయి. కొంతకాలం తర్వాత ఇవి మసిమంగుగా మారుతాయి. తెగుళ్ల సోకిన కాయలపై నల్లని మచ్చలుగా ఏర్పడి అవి అమ్మకానికి డిమాండ్ లేకుండా పోతాయి. ఇది ఎక్కువగా మార్చి నెలలో దీని ప్రభావం ఉంటుంది. కనుక జాగ్రత్త అవసరం. జిగురు లేని కాయలపై మసి తెగుళ్ల సోకదు. ఆకు మసి తెగుళ్ల కనిపిస్తే.. 2 శాతం గంజి ద్రావణం పిచికారీ చేయాలి.

కాయ తొలుచు పురుగు

ఎండు పుల్లలో నిద్రావస్థ దశలో రెక్కల పురుగు వెలువడి కాయలపై గుడ్లు పెడుతుంది. ఈ పురుగు మామిడి పండ్ల దశలో మూడు తరాలు వృద్ధి చెందుతుంది. పురుగు ఆశించిన చెట్టును తొలగించాలి.

కాండం తొలిచే పురుగు

కాండం తొలిచే పురుగు సోకినప్పుడు చెట్టు ఎండిపోతుంది. ఇనుప తీగ సహాయంతో పురుగును తొలగించాలి. పురుగు విసర్జన, పురుగు కొమ్మను తట్టినప్పుడు వచ్చే శబ్దాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి.

పిండి నల్లి

భూమిలో పొదిగిన గుడ్లు, పిల్ల పురుగులు చెట్ల పైకి పాకుతాయి. చీమల ద్వారా పైకి పాకి గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రభావం అధికంగా ఉంటుంది. దీని వల్ల కాయలు సరిగ్గా ఎదగకుండా రాలిపోతాయి. నివారణకు మిథైల్ పెరాథియాన్‌ను పిచికారీ చేయాలి. టెంక పురుగు కాయ లోపలికి చొచ్చుకుని పోయి లోపల గోకి తింటుంది. ఇది ఆలస్యంగా కోత దశలో కనిపిస్తుంది. నివారణకు మి.లీ ఫినిట్రోథియాను నీటితో కలిపి పిచికారీ చేయాలి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

» వినాయకపురంలో ఆధ్యాత్మికశోభ

అశ్వారావుపేట రూరల్, మార్చి 20: మండలంలోని వినాయకపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవోపేతంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మికశోభ వెల్లివెరిసింది. మూడు రోజుల ప్రత్యేక పూజలు, హోమాల అనంతరం బుధవారం ఉదయం శ్రీసీతారామచంద్ర స్వామి పరివార దేవతామూర్తుల విగ్రహాలు, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించారు. ఆలయ ఆవరణ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులతో గ్రామంలో కోలాహలం నెలకొంది. ఆలయంలో సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు



రణాసురుడిని తీసువచ్చేందుకు సిద్ధమైన పూజారులు, భక్తులు

సంప్రదాయబద్ధంగా రణాసురుడు జాతర

ఆళ్ళపల్లి, మార్చి 20: ఆళ్లపల్లి మండలం, నడిమిగూడెం గ్రామంలో వెలసిన పాయం వంశీయుల ఇలవేల్పు అయిన శ్రీ రణాసురుడు జాతర బుధవారం అంగరంగవైభవంగా ప్రారంభమైనది. బుధవారం రోజు పూజారులు, తలపతులు భక్తులు, ఊరగుట్ట నుంచి గిరిజన సంప్రదాయాలతో, డోలీలు, నృత్యాలతో గర్భ గుడికి తీసుకవచ్చారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు వనదేవతును తీసుకవచ్చి జాతర నిండు జాతర జరుపుతారు. ఈ కార్యక్రమంలో తలపతులు, వడ్డెలు, పాయం వంశీయులు పాల్గొన్నారు.



కల్యాణ వేడుకల్లో తంబూరు దయాకర్‌రెడ్డి

పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం

కామేపల్లి, మార్చి 20: కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో కొలువైన పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు తంబూరు దయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు బోడెపుడి విఠల్‌రావు, పువ్వాళ్ల దుర్గప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం సీనియర్ అడ్వకేట్ బోడెపుడి విఠల్‌రావు తన సొంత ఖర్చులతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించాడు. అన్నదాన కార్యక్రమాన్ని తంబూరు దయాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ తిరుపతిరెడ్డి బందోబస్తును పరిశీలించారు. అనంతరం అర్ధరాత్రి స్వామివారి కల్యాణం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్సింహనాయక్, మేకల మల్లికార్జున్, మేకపోతుల మహేష్ పాల్గొన్నారు.



అల్లుకున్న నిర్లక్ష్యం..!

ఏన్కూరు, మార్చి 20: థియేటర్ రోడ్డు మూలమలుపు సమీపంలో ఆర్ అండ్‌బీ శాఖ ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక సిగ్నల్‌బోర్డు చెట్ల తీగలు కమ్మడంతో వాహనదారులకు కనపడకుండా పోయింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సొర తీగ బోర్డు కనబడకుండా చుట్టూ కమ్మేసింది. ఈ రహదారి గుండా వయా తిమ్మారావుపేట మీదుగా ఖమ్మం, ఇల్లెందుకు నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. మూలమలుపు సిగ్నల్ బోర్డు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

మూడో రోజుకు చేరిన మెడికోల నిరసన

» సమస్యలు పరిష్కరిస్తేనే తరగతులకు హాజరవుతామని స్పష్టీకరణ

» పూర్తయిన డీఎంఈ అధికారుల విచారణ

» పరిస్థితులను పరిశీలిస్తున్న కలెక్టరేట్ అధికారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 20: కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల నిరసన బుధవారం మూడో రోజూ కొనసాగింది. కళాశాలలో కనీస వసతులు లేవని, తక్షణమే సమస్యలను పరిష్కరించాలని మెడికోలు చేపట్టిన ఆందోళనకు స్పందించిన డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) బృందం సభ్యులు విచారణ పూర్తిచేశారు. మంగళ, బుధ వారాలు కళాశాలలో పరిస్థితులను పరిశీలించారు. పరిస్థితులను వీడియో, ఆడియో రూపంలో డీఎంఈ కార్యాలయానికి అందజేయనున్నారు. విచారణ కొనసాగుతున్న సమయంలో వైద్య విద్యార్థులు కళాశాల ప్రాంగణంలోనే నిరసన తెలిపారు. కొత్తగూడెం మెడికల్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థులకు వార్షిక పరీక్షలను నిర్వహిస్తుండగా మరో వైపు మెడికోలు నిరసనలు చేపట్టడం గమనార్హం. మరోవైపు మెడికల్ కళాశాలలో మెడికోల నిరసన నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్ కార్యాలయ బృందం విచారణ ప్రారంభించింది. ఈ నెల 22వ తేదీ వరకు పూర్తి స్థాయిలో విచారణ పూర్తి చేసి నివేదికను సమర్పించాలని కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. ఎన్నో ఆశలతో మెడిసిన్‌లో చేరినతాము.. మౌలిక సదుపాయాల కొరత వల్ల చదువులకు న్యాయం చేయలేకపోతున్నామని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

మండుటెండల్లో కళాశాల ప్రాంగణంలో బైఠాయించి ' మాకొద్దు ఈ ప్రిన్సిపాల్, కళాశాలలో కనీస వసతులు కల్పించాలి, ల్యాబ్ పరికరాలను ఏర్పాటు చేయాలి, నాణ్యమైన వైద్య, విద్యను అందించాలి.. ' అంటూ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 299 మంది మెడికోలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పాపం.. పక్క రాష్ట్రం కూలీలు..

» సొంతూరుకు వెళుతుండగా ట్రాక్టర్ బోల్తా

» 12 మందికి ఛత్తీస్‌గఢ్ వాసులకు గాయాలు



పడిపోయిన ట్రాక్టర్ ట్రాలీ

చర్ల, మార్చి 20: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో 12 మంది కూలీలకు గాయాలైన సంఘటన చర్ల మండలం దోసిళ్లపల్లి గ్రామ శివారులో జరిగింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా చింతల్‌న్నార్ చెందిన వలస కూలీలు కొంత మంది కొద్ది రోజుల క్రితం చర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి మిర్చి పనుల నిమిత్తం వచ్చారు. పనులు ముగియడంతో సుమారు 42 మంది ట్రాక్టర్‌లో సొంత గ్రామానికి వెళ్తుండగా, దోసిళ్లపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. కాగా ప్రమాదంలో 12గాయాలయ్యాయి. క్షతగాత్రులను చర్ల వైద్యశాలకు తరలించారు. సీఐ రాజువర్మ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



గాయపడిన కూలీలు

నిజమే, మెయిన్ జవాబు పత్రం ఇవ్వలేదు..

» బాధ్యులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

» భద్రాద్రి కొత్తగూడెం డీఈవో వెంకటేశ్వరచారి



కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 20: భద్రాద్రి జిల్లా పాల్వంచ కేటీపీఎస్ ఉన్నత పాఠశాలలో గత సోమవారం టెన్త్ తెలుగు పరీక్ష నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై విద్యాశాఖ రాష్ట్ర అధికారులకు నివేదికను సమర్పించామని డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు. తెలుగు పరీక్ష సమయంలో కేటీపీఎస్ పరీక్షా కేంద్రంలోని ఓ గదిలో ఇన్విజిలేటర్ విద్యార్థులకు మెయిన్ జవాబు పత్రాలు ఇవ్వలేదని, ఓఎంఆర్ షీట్ మాత్రమే ఇచ్చినట్టు తేలిందని తెలిపారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై విచారణ నివేదికను రాష్ట్ర విద్యాశాఖకు సమర్పించినట్టు తెలిపారు. మెయిన్ జవాబు పత్రం ఇవ్వకపోవడంతో విద్యార్థులు అడిషనల్ జవాబుపత్రంపైనే రాశారని, అయితే మార్కుల పరంగా వారికిఇబ్బంది ఉండదని తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్ రోషయ్యపై నెగ్గిన అవిశ్వాసం

» తాత్కాలిక చైర్‌పర్సన్‌గా వెంకటనర్సమ్మ

కామేపల్లి, మార్చి 20: కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ కాత్రాల రోషయ్యపై అవిశ్వాసం నెగ్గింది. పాలకవర్గ సభ్యులు 13మందిగాను 12మంది హాజరు అయ్యారు. వీరిలో 11మంది సభ్యులు కాత్రాల రోషయ్యకు వ్యతిరేకంగా చేయి లేపారు. దీంతో ఆయన పదవిని కోల్పోయారు. ఎన్నికల అధికారి రవికుమార్ లాటరీ పద్ధతిలో నూతన చైర్మన్‌కు ఎన్నిక నిర్వహించగా.. దొంగల వెంకటనర్సమ్మ పేరు రావడంతో ఆమెను తాత్కాలిక చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. మరో రెండు రోజుల్లో నూతన చైర్మన్ ఎన్నుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, గుజ్జర్లపూడి రాంబాబు, పెంట్యా, తదితరులు ఉన్నారు.

ఎన్నికల నిబంధనలను అమలుచేయాలి

» ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదు

» నగదు తరలింపుపై నిఘా పెట్టాలి

» జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్

అశ్వారావుపేట టౌన్/ ఇల్లెందు/ కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నిబంధనలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. విధుల పట్ల అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం చూపాద్దని సూచించారు, అశ్వారావుపేట మండల పరిషత్ కార్యలయంలో బుధవారం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే రాజకీయ పార్టీలు, నేతలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద కేటాయించిన సిబ్బంది విధులను తనిఖీ చేశారు, అక్రమ మద్యం, నగదు తరలింపుపై నిఘాను పటిష్టం చేయాలని చెప్పారు సమవేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సెక్టార్ ఆఫీసర్లు ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘా బృందాల బాధ్యులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

అన్ని పార్టీలు సహకరించాలి

లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని ఇల్లెందు నియోజకవర్గం సహాయ ఎన్నికల అధికారి జే.కార్తీక్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నామినేషన్ల దాఖలు, ఎన్నికల్లో ప్రచారంలో పాటించాల్సిన సిబంధనల గురించి వివరించారు. ఈసమావేశంలో తహసీల్దార్ కోటా రవికుమార్, సీపీఎం నుంచి ఎస్‌ఏ నబీ, కాంగ్రెస్ నుంచి సుదర్శన్ కోరీ, టీడీపీ నుంచి శ్యామ్, బీజేపీ నుంచి మురళి, మాస్‌లైన్ నుంచి బుర్ర వెంకన్న పాల్గొన్నారు.

లోకసభ ఎన్నికలపై అధికారులకు శిక్షణ


లోక సభ ఎన్నికలు 2024 సందర్బంగా కోడ్ అమలులోకి చ్చిన నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు అసిస్టెంట్ వ్యయ పరిశీలకు, అకౌంటింగ్ బృందానికి బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యయ పరిశీలకులు నోడల్ అధికారి సయ్యద్ ఖుర్షీద్ ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన అధికారులకు శిక్షణ ఇచ్చారు. కొత్తగూడెం, అశ్వారావుపేట, భద్రాచలం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గం పరిధిలోని వారు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలను ప్రతిరోజు మానిటరింగ్ చేయాలని, ఎన్నికల వ్యయం, ఇతరాత్ర అంశాలను నిశితంగా పరిశీలించాలన్నారు.



శిక్షణ ఇస్తున్న నోడల్ అధికారి సయ్యద్ ఖుర్షీద్

ANDHRAJYOTHY ఆంధ్రజ్యోతి

ఖమ్మం

ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి


గురువారం 21 మార్చి 2024

కారేపల్లి సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం అంటూ వదంతులు

కారేపల్లి మార్చి20: కారేపల్లి సహకార సంఘం అధ్యక్షుడు దుగ్గినేని శ్రీనివాస్‌రావుపై కొందరు డైరెక్టర్లు రెండు రోజుల్లో అవిశ్వాస తీర్మానం పెడుతున్నారని బుధవారం మండల వ్యాప్తంగా వదంతులు వెల్లువెత్తాయి. వీటిని అధ్యక్షుడు, డైరెక్టర్లు కొట్టిపారేశారు. మొత్తం 13మంది డైరెక్టర్లు ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన దుగ్గినేని శ్రీనివాస్‌రావు చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అయితే గతఅసెంబ్లీ ఎన్నికల కంటే ముందుగానే శ్రీనివాస్‌రావు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టర్లలో చాలామంది కాంగ్రెస్‌లో చేరేందుకు మంత్రులతో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు అందుబాటులో ఉన్నారు. ఈ నేపథ్యంలో చైర్మన్‌పై అవిశ్వాం పెట్టే ఆలోచన ఎవరికీ లేదని, ఇది కేవలం పుకార్లుగానే కొట్టిపారేస్తున్నారు. పైగా సొసైటీ పాలకవర్గం పదవీకాలం కూడా 10నెలలు మాత్రమే ఉంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు చెప్పారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సహకరించాలి

- కలెక్టర్ గౌతమ్
- బ్యాంకర్లు, ఎక్సైజ్, వ్యయ నియంత్రణ కమిటీలతో సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, మార్చి20: జిల్లాలో స్వేచ్ఛ, న్యాయబద్ధంగా ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, ఎక్సైజ్, వ్యయ నియంత్రణ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, ప్రలోభాల జప్తులపై సూచనలు చేశారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాలను నియంత్రించడానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంకర్లు పెద్ద మొత్తంలో లావాదేవీలు, బల్క్ లావాదేవీలు, ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో డిజిటల్ లావాదేవీల రోజువారి నివేదిక సమర్పించాలన్నారు. డబ్బు రవాణా విషయమై అన్ని బ్యాంకుల బ్రాంచీలు క్యూఆర్ కోడ్ జనరేట్ చేసుకోవాలని ఆయన అన్నారు. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీలలో సీజ్ అయిన వాటికి వెంటనే ఎఫ్ఐఆర్ అయ్యేలా చూడాలన్నారు. పెట్రోల్ పంప్, గోల్డ్ జ్యువెల్లరీ యజమానులు రోజువారి నగదు లావాదేవీలు, ఎంత నగదు, ఎవరి ద్వారా వెళుతుందో వివరాలు అందించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ. 1,69,904 విలువ చేసే మద్యం, 21 బెల్ట్ షాపులను సీజ్ చేశామన్నారు. వాటిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా సహకార అధికారి మురళీధర్ రావు, అదనపు డిసిపి ప్రసాద్ రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్ రెడ్డి, సీపీవో శ్రీనివాస్, ఎల్డిఎం శ్రీనివాసరెడ్డి, బ్యాంకర్లు, ఐటి అధికారులు, జీఎస్టీ అధికారులు, పెట్రోల్ పంప్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఖమ్మం రూరల్: పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మద్దులపల్లి, పోన్నేకల్లు, పెద్దతండా గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. అవసరమున్న చోట పెయింటింగ్ వేయాలని, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్, పోలింగ్ కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు సరిపడా ఉండేలా చూడాలన్నారు. భద్రతా పరంగా అన్ని చర్యలు తీసుకోవాలని రక్షణగోడ లేని పోలింగ్ కేంద్రాలకు వెంటనే రక్షణగోడ నిర్మించాలన్నారు. పెద్దతండా, మద్దులపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రాల్లోని స్టోర్సును పరిశీలించి సామగ్రి నిల్వను తనఖీ చేశారు. పోన్నేకల్లు వద్ద జరుగుతున్న ఖమ్మం- సూర్యాపేట జాతీయ రహదారి పనులను కలెక్టర్ పరిశీలించారు. నెలాఖరుకు పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ యువరాజ్, జడ్పీసీఈఓ నాగలక్ష్మీ, పాలేరు నియోజకవర్గ ఆర్ఓ రాజేశ్వరి, తహసీల్దారు రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎన్‌హెచ్ ఈఈ యుగందర్ అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలించిన కమిషనర్

ఖమ్మంసాంస్కృతికం: రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం పొన్నేకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూంను ఖమ్మం మనిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఖమ్మం ఏసీపీ, అర్బన్ తహసీల్దార్‌లతో కలిసి బుధవారం పరిశీలించారు. ఎన్నికలకు సంబందించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, తదితర ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు.

కోడ్‌ను ఖచ్చితంగా అమలు చేయాలి
అదనపు కలెక్టర్ మధుసూధన్‌నాయక్

నేలకొండపల్లి: ఎన్నికల కోడ్‌ను ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని అదనపు కలెక్టర్(రెవెన్యూ) మధుసూధన్‌నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని పైనంపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును తనిఖీ చేశారు. చెక్‌పోస్టులో అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నామని అధికారులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. కనీస సతులను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పైనంపల్లి పోలింగ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం రాజారాంపేట, చెర్వుమాధారం బీసీ కాలనీల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఎన్నికల కోడ్‌ను దాటేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ గౌరీశంకర్, ఎమ్మార్వై ఆలస్యం మధుసూధనరావు, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి అడిషనల్ కలెక్టర్ వెంట ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి

వైరా: ఎన్నికల నిబంధనలను ప్రతీ ఒక్కరూ విధిగా పాటించాలని సహాయ ఎన్నికల అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ స్పష్టం చేశారు. వైరా రెవెన్యూ కార్యాలయంలో బుధవారం స్థానిక రాజకీయ పార్టీల నాయకులతో ఎన్నికల ప్రవర్తనా నియామవళిపై సమావేశాన్ని నిర్వహించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఆదేశాలు తూచా తప్పకుండా పాటించాలన్నారు., అధికారుల నుంచి అవసరమైన అన్ని అనుమతులు విధిగా తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ కేవీశ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, సీపీఎం పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, బీజేపీ నాయకుడు నరేష్ పాల్గొన్నారు.

బోర్డర్ చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఆర్డీవో

బోనకల్: బోనకల్ వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును బుధవారం రాత్రి ఆర్డీవో గణేష్ తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. శుభకార్యాలకు సంబందించి మహిళలు తమ వెంట తీసుకెళ్తున్న బంగారు ఆభరణాలను వదిలేయాలని సూచించారు. కారణాలు చూపించకుండా ఎక్కువ సంఖ్యంలో రింగులు, చెవి దిద్దులు లాంటివి తీసుకెళ్తే వాటిని పట్టుకోవాలని ఆదేశించారు. నగదు విషయంలో ఎన్నికల నిబంధనల మేరకు తగు ఆధారాలు చూపించాల్సిందేనని స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, ఆర్ఐ లక్ష్మణ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

80 ఏళ్లు పైబడిన వారు ఇంటివద్దే ఓటు వేయవచ్చు : ఆర్డీవో

సత్తుపల్లి: వచ్చే ఎన్నికలలో 80ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులు ముందుగా దరఖాస్తు చేసుకుంటే ఇంటివద్దనే ఓటుహక్కు వినియోగించుకోవచ్చునని కల్లూరు ఆర్డీవో ఎస్.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సత్తుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో అఖిల పక్ష నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. వేసవిలో ఎన్నికలు జరుగుతుండటంతో పోలింగ్ రోజు వేసవి నివారణ చర్యలతో పాటు తాగునీటి సదుపాయం అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. మరణించిన వారి ఓట్ల తొలగింపు, కొత్త ఓట్ల నమోదు, చేర్పులు, మార్పులు చేసిన ఓటర్ల జాబితాను ఆపార్టీ నాయకులకు అందజేసి అభ్యంతరాలు తెలపాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే.యోగీశ్వరరావు, గిర్దావర్లు నరేష్, జానీమియా, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూరంపల్లికి వైరా ఎమ్మెల్యే పరామర్శ



సూరంపల్లిని పరామర్శిస్తున్న వైరా ఎమ్మెల్యే

కొణిజర్ల,మార్చి20: హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ ఎల్‌డీఎం చైర్మన్, కొణిజర్ల మాజీసర్పంచ్ సూరంపల్లి రామారావును బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించి కోలుకునేటట్లు కృషి చేయాలని వైద్యులను కోరారు. కాగా కొణిజర్ల గ్రామస్తులు, పార్టీ నాయకులు, అభిమానులు సూరంపల్లి కోలుకొని ఎప్పుడు ఇంటికివస్తాడా అని ఎదురుచూస్తున్నారు.

పెనుబల్లిలో రేపు కంటి వైద్యశిబిరం

పెనుబల్లి, మార్చి 20: రాజసాయి మందిరం, ఖమ్మం మమత మెడికల్ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పెనుబల్లిలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకుడు జెన్నారెడ్డి విజయ నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఆర్యవైశ్యసంఘం కల్యాణ మండపంలో కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాయలకు సన్మానం

ముదిగొండ, మార్చి 20: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన చైర్మన్ పదవుల్లో రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావును నియమించటంతో బుధవారం ఆయనను ముదిగొండ మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. రాయలను చైర్మన్ పదవిలో నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్ బాబు, మాజీ జడ్పీటీసీ పసుపులేటి దేవేంద్రం, ధర్మా నాయక్, పందిరి అంజయ్య, పురుషోత్తం, పుల్లారెడ్డి, బాబూరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: రాయల నాగేశ్వరరావును జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్ బుధవారం ఖమ్మంలోని రాయల ఇంట్లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, గోపి, వెంకటేష్, భూక్యాచిన్నా, సత్యనారాయణ, రాజశేఖర్‌గౌడ్, మధు, మనోహర్, శ్రీను, ఉపేందర్ పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం

ఖమ్మంసాంస్కృతికం, మార్చి20: ఖానాపురం హవేలిలోని అంకమ్మ, మహాలక్ష్మమ్మ మద్దిరావమ్మ ఆలయ నిర్మాణానికి లక్ష్మీనరసింహాగ్రానైట్స్ యజమాని మల్లేల మన్మధరావు రేణుక దంపతులు బుధవారం లక్ష నూట పదహారు రూపాయలను విరాళంగా అందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ పూజారులు వారి పేరున ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వదించారు.

మురుగు నీరు తొలగింపు

ఖమ్మం సాంస్కృతికం మార్చి 20: నగరంలోని 41వ డివిజన్‌లో సీక్వెల్ ట్యాంక్ బండ్ ఏరియా మేజర్ డ్రైన్‌లో అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పనులు జరుగుతుండటంతో మేజర్ డ్రైన్‌లో మురుగు నిలిచింది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. తుమ్మల గడ్డ బజార్ నుంచి , చెరువు బజార్, లకారం ట్యాంక్ బండ్ అలుగుల వద్ద ప్రజల నివాసాల వారు కార్పొరేటర్ కర్నాటి కృష్ణకు ఫిర్యాదు చేశారు. స్పందించి మునిసిపల్ ఎస్ఈ రంజిత్‌కు ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేశారు. డ్రైన్‌లో తూటికాడ, తదితర చెత్తా చెదారం తొలగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కర్నాటి కృష్ణతోపాటు మునిసిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

24న సప్తకళా సమ్మేళనం

ఖమ్మంసాంస్కృతికం,మార్చి20: ప్రముఖ కళాకారుడు ఫైర్‌రవి ఆధ్వర్యంలో ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు సప్తకళాసమ్మేళన కార్యక్రమం జరుగనుంది. ప్రచార బ్రోచర్‌ను బుధవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, వేల్పుల విజేత మాట్లాడుతూ ఫైర్ రవి స్వయం కృషితో కళారంగంలో ఎంతో ఉన్నతి సాధించాడన్నారు. కళాభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఓటర్లకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్

పోలీసు కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మంక్రైం,మార్చి20: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే భరోసా కల్పించేందుకే పోలీసు కవాతు నిర్వహిస్తున్నామని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో సెంట్రల్ పోలీసు ఫోర్సు, పారామిలటరీ బలగాలు, స్థానిక పోలీసు సిబ్బంది కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసుకమిషనర్ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టినట్టు తెలిపారు. అందులో భాగంగానే కవాతు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నచ్చిన వ్యక్తికి, ఓటువేసే ప్రశాంత వాతావరణం కలిపించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజలంతా నిర్భయంగా ఓటుహక్కును వినియోగించు కునేందుకు జిల్లావ్యాప్తంగా సెంట్రల్ పోలీసు ఫోర్సుతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్టు తెలిపారు. జిల్లా పోలీసులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నూతన పోలీసు పెట్రోలింగ్ వాహనాలు, బ్లూకోల్ట్ బృందాలు బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందుకోసం ప్రజలు సహకరించాలన్నారు.

వారం రోజులుగా వెలగని వీధిలైట్లు

- గ్రామసభలో విన్నవించినా పట్టించుకోని అధికారులు

కల్లూరు, మార్చి20: కల్లూరు పట్టణంలో వారం రోజులుగా పలు వీధుల్లో వీధిలైట్లు వెలగటం లేదు. గతవారం జరిగిన గ్రామ సభలో ఎంపీటీసీ కొండూరి కిరణ్‌కూమార్‌తో పాటుగా పలువురు గ్రామసభలో ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొవచ్చారు. వీధిలైట్లు వెలగటం లేదని ప్రజలు విన్నవించుకున్న నేటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోని పరిస్థితి నెలకొంది. వారం రోజుల క్రితం పట్టణంలో హైఓల్టేజితో వీధిలైట్లు కాలిపోయినట్లు తెలిసింది. వాటిస్థానంలో నేటి వరకు పంచాయితీ వారు కొత్త లైట్లు ఏర్పాటు చేయక పోవటం పట్టణంలోని శాంతినగర్, అంబేద్కర్‌నగర్, మెయిన్ రోడ్‌లోని కొంతభాగం వీధిలైట్లు వెలగక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయితీ కార్యదర్శి కృష్ణారావు వివరణ ఇస్తూ త్వరలో కొత్తలైట్లు తీసుకొచ్చి వీధిలైట్లు వెలిగిస్తామని చెప్పారు.



కల్లూరు శాంతినగర్ వీధిలో వెలగని వీధిలైట్లు

ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం

కల్లూరు, మార్చి20: కల్లూరులోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో బుధవారం నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పి సాంబశివుడు,విద్యాసంస్థల అధినేత లక్కినేని ప్రసాద్ ఓటు దుర్వినియోగం కాకుండా సరైన రీతిలో ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థులచే ఓటు ప్రతిజ్ఞ చేయించి చైతన్యం కలించేలా పోస్టర్‌ను ఆవిష్కరిం చారు.

నేటినుంచి కందుకూరులో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు





వేంకటేశ్వరస్వామి ఆలయం

వేంసూరు, మార్చి20: మండల పరిధిలోని కందుకూరులోని శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి 26వరకు నిర్వహించనున్నారు. 23నరాత్రి 9.25గంటలకు శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవం, 24న ఉదయం స్వామివారి గ్రామసేవ, కందుకూరు భక్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యకమం నిర్వహించనున్నారు. 25న రాత్రి దొంగల దోపోత్సవం అనంతరం చింతామణి సందేశాత్మక పద్యనాటకం, 26న స్వామివారి పవళింపు సేవతోపాటు మ్యూజికల్ నైట్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈవో వీవీ.నర్సింహారావు ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 23నుంచి 26వతేదీ వరకు చెడుగుడు పోటీలను నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర...

కందుకూరులో పడమర భాగాన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉంది. పూర్వం సుమారు 500సంవత్సరాల కిందట గ్రామానికి చెందిన ఓ భక్తుడు తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు తపస్సు ప్రారంభించాడు. చాలా దూరం ఉండటంతో ఎల్లప్పుడు వెళ్లుట కష్టతరంగా ఉన్నందున స్వామివారిని కందుకూరు వేంచేయుటకు ప్రార్థించాడు. కలలో మీ గ్రామమునకు వస్తాను తిరిగి వెళ్లమని పంపాడు. ఒక రాత్రి స్వప్నంలో ఓ ప్రదేశం స్వామిఉంటాడని చెప్పినాడు. ఆ ప్రదేశం తవ్వించగా స్వామివారి శిలా విగ్రహం బయట పడింది. ఆ ప్రాంతంలో ఆలయం కట్టి, నిత్యం ఒక ఎకరం భూమిలో పండిన పంట నైవేద్యంగా వండి పెట్టేవారు. ఇలా స్వామివారికి 360ఎకరాల భూమి ఉంది. కాగా ఆ భక్తుడి వివరాలు, వారి గోత్రనామాలు కూడా తెలియవు. ఈ ఆలయంలో శాస్త్రీయ పద్ధతిలో వైఖానస సంప్రదాయ ప్రకారం పజలు నిర్వహిస్తున్నారు.

ఖురాన్ పఠనంతో మానసిక ప్రశాంతత



ప్రసంగిస్తున్న ఖాన్మీ

ఖమ్మంసాంస్కృతికం మార్చి20: ఖురాన్ పఠనంతో ప్రతీ మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని ఖురాన్ బోధకుడు ముఫ్తీ మహ్మద్ అబ్దుల్ రవూఫ్ ఖాన్‌ఖాన్మీ అన్నారు. నగర శివారు గొల్లగూడెం తాలిముల్ ఇస్లాం మదర్సాలో రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన ఖురాన్ పఠన కార్యక్రమ ముగింపు ఖత్మేఖురాన్ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మనిషి ప్రశాంతంగా ఆలోచించటం ప్రారంభిస్తే సమాజంలో ఎటువంటి సమస్యలు తలెత్తబోవన్నారు. నేటి తరం పిల్లలకు ఖురాన్ ప్రాధాన్యతను వివరించాల్సిన అవసరం తల్లి దండ్రులపై ఉందన్నారు. ఇస్లాం సందేశాన్ని ఒకొకరు మరో పదిమందికి అందించాలన్నారు. ముస్లింల ఆచరణ ఇతరులకు ఆదర్శంగా ఉండాలన్నారు.

నాగులవంచలో దేవాలయ అభివృద్ధి పనులు

చింతకాని, మార్చి 20: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలోని శ్రీ కంఠమహేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. గ్రామంలో విరాళంగా సేకరించిన రూ.2లక్షలతో దేవాలయంలో కాంక్రిట్ నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో నాయకులు మడిపల్లి భాస్కర్, కోదండ రామాలయ చైర్మన్ నారగాని శ్రీనివాసరావు, కంభం వీరభద్రం, బైరు శ్రీరాములు, ముత్తినేని వెంకటేశ్వర్లు, వెచ్చ మంగయ్య, యల్లంపల్లి చిన్న అప్పారావు, కంభం నాగేశ్వరరావు అనగాని శ్రీను, కందిమల్ల చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

వైరా, మార్చి 20: వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వైరాలోని గర్భిణీ మహిళలకు సామూహిక సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నంబూరి మధుసూదన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 27మంది గర్భిణీ మహిళలకు సీమంతాలు నిర్వహించి రూ.20వేల విలువైన చీరలు, సీమంత కిట్లను అందజేశారు. మధిర ఐసీడీఎస్ సీడీపీవో కమలప్రియా, ఏసీడీపీవో ఉషారాణి, హెడ్‌నర్సు రాజేశ్వరి, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పెనుగొండ ఉపేంద్రరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, కొమిరిశెట్టి శ్రీధర్, చింతోజు నాగేశ్వరరావు, నంబూరి విజయరాణి పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న గర్భిణులతో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఖమ్మంరూరల్,మార్చి20: మండల పరిధిలోని నాయుడుపేట యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలేరు నియోజకవర్గ క్రికెట్ పోటీలను బుధవారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ హయాంలో గ్రామీణ స్థాయిలో క్రీడకారుల ప్రతిభ వెలికితీయడం జరుగుతుందన్నారు. ఇందుకోసం మంత్రి పొంగులేటి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు సాయి, ఏసు, సాయి, వెంకటరెడ్డి, మద్ది వీరారెడ్డి, తోట వీరభద్రం, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

22న ఎన్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ సమావేశం

ఖమ్మంసాంస్కృతికం మార్చి20: ఎన్ఆర్ఐపేరెంట్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం ఈనెల 22న ఉదయం జరగనున్నది. శ్రీశ్రీ సర్కిల్ సమీపంలోని వాసిరెడ్డి కన్వెన్షన్‌లో ఈసమావేశం జరుగుతుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేదరమెట్ల స్వరూపరాణి, కానూరు హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు.

కార్మికుల పక్షపాతి చలమాల

పెనుబల్లి, మార్చి 20: కార్మికుల పక్షాన ఉండి వారికి అనేక సౌకర్యాలు కల్పించడంలోనూ, కార్మిక సంఘాల పటిష్టత కోసం చలమాల గంగాధర్‌రావు చిరస్మరణీయుడని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. బుధవారం వీఎంబంజర్‌లో చలమాల గంగాధర్‌రావు 13వ వర్ధంతి సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, కవి గోపిశెట్టి వెంకటేశ్వరరావు, సామినేని శ్రీనివాసరావు, కలకోట వెంకటేశ్వరరావు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఖమ్మంచర్చికాంపౌండ్,మార్చి20: ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో బుధవారం అనాథ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న బాలు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చెరుకుపల్లి బాలు ఆధ్వర్యంలో నగరంలోని ప్రకాష్‌నగర్ వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

కానిస్టేబుల్‌కు పోలీసుల నివాళి

ఖమ్మంక్రైం,మార్చి 20: 2013 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఇస్లావత్ బాలరాజు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాదులోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామమైన తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్‌తండాకు తరలించగా పోలీసు అధికారులు ఆర్ఐ కామరాజు, శ్రీశైలం, తోటి సిబ్బంది, పోలీసు అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి వెంకటేశ్వర్లు, మోహన్‌రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. శాఖపరంగా అందాల్సిన ప్రయోజనాలు అందేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం

ఏన్కూరు, మార్చి 20: ఇటీవల ఐసీడీఎస్ కమిషనర్ నుంచి ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా అవార్డు పొందిన ముదిగొండ అరుణకుమారిని బుధవారం మున్నూరుకాపు నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ముున్ముందు కూడా ఇలాగే వృత్తి ధర్మాన్ని పాటిస్తూ మరెన్నో అవార్డులు సాధించాలని కోరారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు పిన్ని వెంకటనారాయణ, గౌరవాధ్యక్షుడు ఆవుల నర్సయ్య, ఉపాధ్యక్షుడు కోపూరు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పాశం శ్రీనివాసరావు, సంఘం నాయకులు పిన్ని వెంకటేశ్వరరావు, ముదిగొండ నాగేశ్వరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్‌ను సన్మానిస్తున్న దృశ్యం